A1TV NEWS

నేటి

APTEL 2023/16425

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 148 ఆదివారం 24 డిసెంబర్ 2023 పేజీలు 4. వెల :4 /

## ఏప్రిల్ నెలలోనే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు.?

ఆంధ్రప్రగతి అమరావతి డిసెంబర్23:
రెండు రోజులుగా కేంద్ర ఎన్నికల బృందం పర్య టిస్తూండటంతో ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల వేడి రాజు కుంటోంది. శుక్రవారం నాడు 18 జిల్లాలలో పరిస్థితిని సమీక్షించిన ఎన్నికల బృందం, శనివారం మరో 8 జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వ హిస్తోంది.
సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఎన్నికల బృందం ఆరా తీసింది. ఓటర్ల జాబితాలో అవ కతవకలపై కూడా ఎన్నికల అధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. ఏప్రిల్ లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందంటూ ఎన్నికల బృందం సూచ నప్రాయంగా వెల్లడించింది. సమయం ఎక్కువగా లేనందున యుద్ధప్రాతి పదికన సన్నద్ధం కావా లంటూ కలెక్టర్లు, ఎస్పీలకు



సూచించింది. ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని అరికట్టాలని ఎన్నికల బృందానికి నాయకత్వం వహించిన డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ కలెక్టర్లను, ఎస్పీలను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ను కట్టుదిట్టం చేయాలని, చెక్ పోస్టులపై ఒక కన్ను వేసి ఉంచాలని సూచిం చారు.

## అయ్యప్ప స్వాములూ.. జర జాగ్రత్త.!

**-ఒక్క కేరళలోనే 2వేల మందికి పైగా పాజిటివ్. -తమిళనాడు,కర్ణాటక,తెలంగాణల్లోనూకేసులు.**

**-విశాఖలో మూడు పాజిటివ్ కేసులు. -రాజమహేంద్రవరంలో వృద్ధురాలికి కొవిడ్.**

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 23:
దేశంలో కరోనా మహమ్మారి మరోమారు కలకలం రేపుతోంది. కొవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1 తీవ్ర రూపం దాలుస్తోంది. కేరళలో మొదలై అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 2,500 వరకూ కేసులు వెలుగులోకి వచ్చాయి. కొత్త వైరస్ ఈ నెల 6న దేశంలోకి ప్రవేశించిన నాటినుంచి రోజుకు 300కు పైగానే కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుతం కేరళలోనే అత్యధికంగా పాజిటివ్‌లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి అయ్యప్ప స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు శబరిమలై వెళ్తున్నారు. కేరళలో కరోనా విస్తరణ వేగం పుంజుకుంటున్నందున వీరంతా కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. జనసందోహం ఉన్న ప్రదేశాలకు వీలైనంత వరకూ దూరంగా ఉండాలని, దర్శనం సమయంలో కచ్చితంగా మాస్క్ ధరించాలని, శానిటైజర్ ఉపయోగించాలని సూచిస్తున్నారు. వీలైతే దర్శనం అనంతరం నేరుగా ఇంటికి వచ్చే అవకాశాలను పరిశీలించాలని చెబుతున్నారు. యాత్ర ముగించుకుని వచ్చిన స్వాముల్లో జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. నెగెటివ్ ఫలితం వచ్చినా కుటుంబ సభ్యులకు దూరంగా హెూం ఐసొలేషన్‌లో ఉండి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు కూడా వీలైనంత



వరకూ తీర్థయాత్రలకు సంబంధించిన ప్రయాణాలు వాయిదా వేసుకోవడమే మంచిదని పేర్కొంటున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రయివేటు ల్యాబ్‌ల్లో కొవిడ్ పరీక్షలు ప్రారంభించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో కొత్త వేరియంట్ కేసులు రాలేదు. కానీ అక్కడక్కడ పాజిటివ్‌లు నమోదవుతున్నాయి. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడలో ఇప్పటికే పాజిటివ్ వచ్చిన వారికి సంబంధించిన శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విజయవాడ పంపినట్లు తెలుస్తోంది.
ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. అత్యధికంగా కేరళలో 2,100 మందికి పాజిటివ్ వచ్చింది. కొత్త వేరియంట్‌కు సంబంధించి కర్ణాటకలో 80కిపైగా, తమిళనాడులో 70, మహారాష్ట్రలో 40, తెలంగాణలో 9 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఏపీ నుంచి ఎక్కువమంది అయ్యప్ప భక్తులు కేరళ వెళ్లి వస్తున్నారు. ఇదే అతిపెద్ద ప్రమాదంగా మారుతుందేమోననినిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించడం, శానిటైజర్ ఉపయోగించడంతో పాటు భౌతిక దూరం నిబంధన పాటించాలని సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు జనసందోహం ఉన్న ప్రదేశాలకు వెళ్లొద్దని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.
తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన 84ఏళ్ల వృద్ధురాలికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. రెండురోజుల క్రితం లక్షణాలు కనిపించడంతో శాంపిల్స్ తీసుకుని, ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ కోసం కాకినాడ ల్యాబ్‌కు పంపగా, పాజిటివ్ వచ్చినట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఆమెను హెూం ఐసొలేషన్‌లో ఉంచి వైద్యసేవలందిస్తున్నారు.
విశాఖపట్నం జిల్లాలో కొవిడ్ లక్షణాలతో బాధపడుతున్న ముగ్గురు ల్యాబ్‌కు వెళ్లి పరీక్ష చేయించుకోగా పాజిటివ్ వచ్చింది. వీరి నమూనాలు విజయవాడలోని జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌కు పంపించారు. వీరిలో ఒకరికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండడంతో అపోలో ఆస్పత్రిలో చేరారు. మిగిలిన ఇద్దరూ హెూం ఐసోలేషన్‌లో ఉన్నారు. కాగా, నెల్లూరులో రెండురోజుల క్రితం లక్షణాలు కనిపించిన ముగ్గురిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. కరోనా బాధితుల కోసం ఏర్పాటుచేసిన వార్డులో ఉంచారు. ఆర్‌టీపీసీఆర్ పరీక్షల్లో నెగెటివ్ రావటంతో బాధితులను డిశ్చార్జ్ చేశారు. కరోనా బాధితుల కోసం జీజీ హెచ్‌లో 110 పడకలను సిద్ధంచేశారు.

## టిడిపి ఎన్నికల హామీని.. ముందే అమలు చేస్తున్న జగన్ సర్కార్.?



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 23 :
ఏపీలో ఎన్నికల హడావిడి మొదలయ్యింది. అధికారం కోసం అన్ని పార్టీల అధినేతలు ప్రజలకు హామీల వర్షం కురిపిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటకలో మహిళలకు రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణం కల్పించి కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. టీడీపీ అధినేత చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామంటూ హామీ ఇచ్చారు. డిసెంబార్ 20 న విజయనగరంలో జరిగిన 'యువగళం-నవశకం' సభలో చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆంశంపై హామీ ఇచ్చారు. దాంతో జగన్ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ఈ హామీని ముందగానే అమలు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. అందుకోసం సీఎం జగన్ అధికారులతో.. ఉచిత ప్రయాణం అమలు చేస్తే ఆర్టీసీ రాబడి ఎంత తగ్గుతుంది? ప్రభుత్వం ఎంత చెల్లించాల్సి వస్తుంది.. పొరుగు రాష్ట్రాలు ఏ నిబంధనలతో అమలు చేశాయి.. అన్న అంశాలపై అధికారులతో చర్చిస్తున్నారు.
సంక్రాంతి పండుగ నుంచే ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలుస్తుంది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం, విజయవాడలోని సిటీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయాలని అనుకుంటున్నట్టు సమాచారం.
ఏపీలో ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో నిత్యం 40 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అందులో 15 లక్షల మంది మహిళలు ప్రయణం చేస్తున్నారు. 10 లక్షల వరకు బస్ పాస్ లు కలిగినవారు ఉన్నారు. 3 నుంచి 4 లక్షల వరకు విద్యార్థినులు ప్రయాణిస్తున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీకి రోజుకు సగటున రూ. 17 కోట్ల ఆదాయం వస్తోంది.

## చిదంబరం నేతృత్వంలో 2024 ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ

**- మొత్తం 16 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు**



న్యూఢిల్లీః తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో సంచలన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. 2024 లో జరిగే లోక్ సభ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించింది. ఈసారి ఎలాగైనా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే కృతనిశ్చయంతో పోరుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం నేతృత్వంలో 2024 ఎన్నికల మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం 16 మంది సభ్యులతో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ కమిటీని ప్రకటించారు. ఇందులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఉన్నారు. లోక్ సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఎజెండాను ఖరారు చేసే ఈ కమిటీలో కేంద్ర మాజీ మంత్రులు ఆనంద్ శర్మ, జైరాం రమేశ్, శశిథరూర్ లు కీలకంగా వ్యవహరించనున్నారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చీఫ్ ప్రవీణ్ చక్రవర్తి, లోక్ సభలో పార్టీ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగోయ్, మణిపూర్ మాజీ డిప్యూటీ సీఎం గైఖాం గమ్ తదితరులు కూడా కమిటీలో ఉన్నారు.

# జగన్ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.

**-ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ చంద్రబాబుతో భేటీ.**

**-జగన్ ప్రభుత్వంపై లోతైన విశ్లేషణతో ప్రశాంత్ కిషోర్ నివేదిక.**

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 23:
ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్?తో కలిసి గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ప్రశాంత్ కిషోర్ అక్కడి నుంచి నేరుగా చంద్రబాబు వద్దకు వెళ్లారు. లోకేశ్ కారులోనే ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి ప్రశాంత్ కిషోర్ వెళ్లటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ వైసీపీ తరపున ఎన్నికల వ్యూహకర్తగా ప్రధాన పాత్ర పోషించారు. చంద్రబాబు - ప్రశాంత్ కిషోర్ భేటీ పై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్?లో వైఎస్ జగన్ తరపున ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహాన్ని అమలు చేశారు. తాజాగా ప్రశాంత్ కిషోర్ చంద్రబాబుతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీసింది. ఇటీవల యువగళం పేరిట రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన నారా లోకేశ్, పార్టీ ఎన్నికల సన్నద్ధతపై వివిధ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు.
ఎన్నికల ముందే సోషల్ మీడియాను మరింత బలోపేతం చేసేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటి వరకూ టీడీపీ తరపున రాబిన్ శర్మ ఎన్నికల వ్యూహకర్తగా ఉన్నారు. షో టైమ్ కన్సల్టెన్సీ పేరిట ఇప్పటికే తెలుగుదేశం పార్టీకి రాబిన్ శర్మ రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రశాంత్ కిషోర్‌తో పాటు రాబిన్ శర్మ టీం సభ్యులు కూడా చంద్రబాబు నివాసానికి వచ్చారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓటమికి దారితీసే పరిస్థితులపై ఇప్పటికే ఐ ప్యాక్ టీం జగన్‌కు పలు నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, తప్పుడు విధానాలు, ప్రజావ్యతిరేకతపై పీకే బృందం పలు నివేదికలు జగన్‌కు అందజేసింది. రాష్ట్రంలో వైసీపీ పరిస్థితిపై ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. రాష్ట్రంలో మారిన పరిస్థితులు, ఆయా వర్గాల్లో వ్యతిరేతపై జగన్‌కు నివేదించింది. ప్రశాంత్ కిషోర్ సూచనలను, హెచ్చరికలను సీఎం జగన్ పట్టించుకోలేదనే చర్చ జరుగుతుండగా తాజాగా చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ భేటీపై ఉత్కంఠ నెలకొంది.
పార్టీ క్యాడర్?లో జగన్?పై తీవ్ర వ్యతిరేకత : ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ - చంద్రబాబు సమావేశం ముగిసింది. దాదాపు 3 గంటలపాటు చంద్రబాబు-ప్రశాంత్ కిషోర్ చర్చించారు. అనంతరం ప్రశాంత్ కిషోర్ చంద్రబాబు నివాసం నుంచి గన్నవరం బయలుదేరారు. లోకేశ్?తో కలిసి గన్నవరం విమానాశ్రయానికి వెళ్లారు. చంద్రబాబు, ప్రశాంత్ కిషోర్ మధ్య కీలక అంశాల ప్రస్తావన వచ్చినట్లు తెలుస్తోంది. జగన్ ప్రభుత్వంపై లోతైన విశ్లేషణతో ప్రశాంత్ కిషోర్ నివేదిక ఇచ్చారు. ఆయా వర్గాలు, అంశాల వారీగా ప్రభుత్వ బలాబలాలు వివరించారు. వైసీపీ ప్రభుత్వ విధానాలపై యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పీకే తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపే పలు అంశాలు వివరించారు. నిరుద్యోగం, ధరలు ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతాయని విశ్లేషించారు. విద్యుత్ ఛార్జీలు, పన్నుల బాదుడు తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. దళితులు, బీసీలపై దాడులు ఆయా వర్గాలను వైసీపీకి దూరం చేశాయని, ఒకరిద్దరు మినహా మంత్రులకు సున్నా మార్కులని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి అహంకారం పెరిగిందనే భావన ప్రజల్లో వచ్చిందన్న పీకే, ప్రజల అభిప్రాయాల మేరకు ప్రతిపక్షాల వ్యూహరచన ఉండాలని సూచించారు. అసంతృప్తితో ఉన్న యువతను ఆకర్షించేలా టీటీపీ కార్యాచరణ ఉండాలని, చంద్రబాబు అరెస్టుతో తటస్థులు, వైసీపీ వర్గాల్లో జగన్‌పై వ్యతిరేకత వచ్చిందని తెలిపినట్లు తెలుస్తోంది.



# బాల అకాడమీ పాఠశాల నందు ఘనంగా జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్23:
నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు శనివారము జరుపుకోవడం జరిగినది. శనివారం చిన్నారులు క్రిస్మస్ వేడుకలలో భాగంగా శాంటా క్లాస్,ఏంజిల్స్ ,తూర్పు దేశపు జ్ఞానులు, లాగా మేరీ, జోసెఫ్ గొర్రెల కాపరుల వేషధారణలో వచ్చారు ఉపాధ్యాయుల ద్వారా క్రిస్మస్ పండుగలోని ముఖ్య ఉద్దేశంలో తెలుసుకున్నారు క్రిస్మస్ క్రైస్తవులకు ముఖ్యమైన పండుగ అని ఏసుక్రీస్తు పుట్టిన రోజులు ఈ రోజు జరుపుకుంటారు యేసు క్రైస్తవ మత మూలపురుషుడు ఈయన సాధారణంగా ఏసుక్రీస్తుగా కూడా వ్యవహరించబడతాడు ఇందులో క్రీస్తు అన్న పదం గ్రీకు భాషలో" క్రీస్తోస్"అంటే "అభిషక్తుడు అనే అర్థం వచ్చే పదము నుండి పుట్టింది .పాపం చేసిన వాడికి శిక్ష విధించడం కాదు పాపమే మరణించాలి అలా జరిగితే పాపం లేని మనిషి పాప రహితుడై యేసు క్రీస్తులా మారతాడని దేవుని నమ్మకం. అందుకే నశించిన దాన్ని వెతికి రక్షించే నిమిత్తం ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపాడని విశ్వసిస్తారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవి లత మాట్లాడుతూ యేసు క్రీస్తు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలసింది ముగ్గురు జ్ఞానులు ఆ నక్షత్రాన్ని అనుసరించి వెళ్లి బాల యేసును దర్శించి కామానంద భరితులయ్యారు ఆ గుర్తుగా వారు బాలయ్య సుకుముడు కానుకలను సమర్పించారు అవి బంగారం గోలము పరిమళ సాంబ్రాణి వారు సమర్పించిన బంగారం క్రీస్తు ప్రభువు పరిశుద్ధతకు పవిత్రతకు చిహ్నంగా కనబడుతుంది అందరూ ఒకరి పట్ల మరొకరు ప్రేమానురాగాలు కలిగి ఉండటం ద్వేషాన్ని విడనాడటం క్రిస్మస్ పర్వదిన ప్రాముఖ్యమని తెలిపారు క్రైస్తవ మతస్తులందరికీ మిత్రులకి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీ లత ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జరిగిన జాతీయ రైతు దినోత్సవము.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 23:
నంద్యాల జిల్లాలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాలల అకాడమీ పాఠశాలలో డిసెంబర్ 23వ తేదీన అనగా శనివారము జాతీయ రైతు దినోత్సవం జరుపుకోవడం జరిగినది.ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి.రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీ లత మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక లాంటివాడు రైతు లేనిదే మనిషి లేడు దేశాన్ని రక్షించే జవానులకు ఎంత ప్రాముఖ్యత ఉందో....పట్టెడన్నం పెట్టే రైతన్నలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది అందుకే జై జవాన్... జై కిసాన్ అనే నినాదం యావత్ భావతావనిలో వినిపిస్తుంది. రైతుల గురించి వ్యవసాయ రంగం గురించి అంతగా ఆలోచించి వారి సమస్యల పరిష్కారానికి చరణ్ సింగ్ చేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వం ఆయన జన్మదినమైన డిసెంబర్ 23న జాతీయరైతు దినోత్సవంగా ప్రకటించింది .భారతదేశ 5వ ప్రధానమంత్రిగా సేవలను అందించారు. భారతదేశపు రైతుల విజేతగా మరియు రైతు బంధువుగా పేరుపొందారు. భారత ప్రభుత్వం ఆయన చిత్రంతో 1990 మే 29న తపాలా బిళ్ళను విడుదల చేసింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు తమదైన శైలితో రైతు గొప్పతనాన్ని వివరించే పాటలు, ఉపన్యాసాలు, లఘు నాటికలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి. వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీ లత ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకతీయ వర్సిటీలో ర్యాగింగ్ కలకలం

## జూనియర్లను వేదించిన సీనియర్ అమ్మాయిలు 81 మంది లేడ ఈస్టూడెంట్స్ సస్పెన్షన్

వరంగల్,డిసెంబర్23 :
వరంగల్ కాకతీయ వర్సిటీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. పరిచయాల పేరిట జూనియర్లను వేధించిన సీనియర్లను వారం పాటు బహిష్కరించారు. వీరంతా అమ్మాయిలే కావడం విశేషం. కొత్తగా చేరిన జూనియర్లను సీనియర్లు వేధించడం పరిపాటిగా మారిపోయింది. ర్యాంగింగ్ కు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నప్పటికీ, సీనియర్లు పట్టించుకోవడం లేదు. జూనియర్లను ర్యాగింగ్ పేరుతో ఏడిపిస్తున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో సీనియర్లు రెచ్చిపోయారు. నూతన పరిచయం పేరుతో జూనియర్లను వేధించారు. ర్యాగింగ్ చేసిన 81 సీనియర్లపై హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపల్ చర్యలు తీసుకున్నారు. 81 మందిని వారంరోజుల పాటు హాస్టల్ నుంచి బహిష్కరిం చారు. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్రలో ర్యాగింగ్ కు పాల్పడిన విద్యార్థులందరి హాస్టల్ నుంచి సస్పెండ్ చేయడం ఇదేతొలిసారి. ర్యాగింగ్ చేసిన విద్యార్థినులందరూ కామర్స్, ఎకనామిక్స్, జువాలజీ విభాగాలకు చెందిన వారు. కొత్తగా చేరిన వారిని పరిచయ క్లాసుల పేరుతో సీనియర్లు వేధింపులకు గురి చేశారు. ఇది కాస్త పెచ్చుమీరడంతో కొందరు బాధితులకు హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపల్ కు ఫిర్యాదు చేశారు. పరిచయాల పేరుతో ర్యాగింగ్‌కు పాల్పడుతున్న పీజీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వివరాలు ఆరా తీశారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల వారి వివరాలు సేకరించారు. క్యాంపస్ లోని అన్ని విభాగాల్లోని సీనియర్లు, జూనియర్లను వేధిస్తున్నట్లు తేలింది. దీంతో ర్యాగింగ్ చేసిన 81 మంది విద్యార్థులను సస్పెండ్ చేశారు.క్యాంపస్ లోని హాస్టల్స్ కు క్రిస్మస్ సెలవులు ప్రకటించారు. విద్యార్థులందరూ వెంటనే ఇళ్లకు వెళ్లిపోవాలని హాస్టల్ వార్డెన్ సూచించారు. క్యాంపస్‌లో ఎవరు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. ఏ యే విభాగాలు, హాస్టళ్లలో ర్యాగింగ్ చేస్తున్నారో వివరాలు సేకరిస్తున్నారు అధికారులు. సరైన ఆధారాలు లభిస్తే వారినీ సస్పెండ్ చేస్తామని, ఎవర్ని వదిలిపెట్టేది లేదంటున్నారు. ఒకేసారి ఇంత పెద్దమొత్తంలో యువతులపై సస్పెన్షన్ వేటు పడటం యూనివర్శిటీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటి వరకూ ర్యాగింగ్ విషయాల్లో అబ్బాయిలు ఉండే వారు. కానీ, ఇప్పుడు ర్యాగింగ్‌కు పాల్పడిన వారిలో అమ్మాయిల పేర్లు రావడం చర్చనీయాంశంగా మారింది.
కేయూలో విద్యార్థినులకు వసతి కల్పించడం కోసం ఐదు హాస్టల్స్ ఏర్పాటు చేశారు. పద్మాక్షి ఏ, బీ, సీ, డీ, ఈ అనే బ్లాక్ లు విద్యార్థినుల కోసం కేటాయించారు. వాటిల్లో రెగులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు సంబంధించిన దాదాపు 1,800 మంది విద్యార్థినులు హాస్టల్ లో ఉంటున్నారు. గత ఏడాది ఫిబ్రవరి నెలలో వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ దుమారం రేపింది. సీనియర్ల వేధింపుల వల్ల డాక్టర్ ప్రీతి సూసైడ్ చేసుకుంది. ఆ తర్వాత వేధింపులకు పాల్పడిన నిందితుడు సైఫ్ ను పోలీసులు అరెస్ట్ చేసి చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# డాక్టర్ రవి కృష్ణకు జాతీయ ఐఎంఏ ఉత్తమ రాష్ట్ర అధ్యక్ష పురస్కారం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 23:



ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా ఈ సంవత్సరంలో డాక్టర్ జి.రవికృష్ణ రాష్ట్రంలో నూతనంగా వెయ్యి మంది వైద్యులను ఐఎంఏ సభ్యులుగా చేర్చుకోవడం తద్వారా మొత్తం రాష్ట్ర ఐఎంఎ సభ్యుల సంఖ్య ఇరవై వేలు దాటేలా చేసినందుకు, కొత్తగా ఆరు నూతన శాఖలు ప్రారంభించడంలో, పలు నిరంతర వైద్య విద్యా సదస్సులు నిర్వహించినందుకు,ఐఎంఏ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషికి, వివిధ వైద్య సేవా కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించిన దానికి గుర్తింపుగా జాతీయ ఐఎంఏ "ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుడిగా జాతీయ పురస్కారం" ఢిల్లీలో ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ శరద్ కుమార్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ నాయక్ ప్రకటించారు.ఈనెల 27వ తేదీ తిరువనంతపురంలో నిర్వహించనున్న 98 వ జాతీయ ఐఎంఏ సదస్సులో ఈ పురస్కారాన్ని ఇవ్వనున్నారు.డాక్టర్ రవి కృష్ణ కు పురస్కారం ప్రకటించిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ నాయకులు, సభ్యులు హర్షం ప్రకటించారు.

# పివికి ఘనంగా నివాళి అర్పించిన గుత్తా

## - బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రశంసలు

నల్లగొండ,డిసెంబర్24
మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత పీవీ నరసింహా రావు వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్మరించుకున్నారు. నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బహుముఖ ప్రజ్ఞాశాలి, అనేక భాషల్లో అనర్గళంగా మాట్లాడే గొప్ప మేధావి పీవీ నరసింహా రావు అన్నారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు ఎనలేని సేవ చేశారన్నారు. దేశానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించి తెలుగువాడి ఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచారని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఐతగొని స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, హరికృష్ణ, మాజీ ఎంపీపీ దైదా రజిత రెడ్డి, రామలచ్చయ్య, మునాస వెంకన్న, చిలకరాజు శ్రీనివాస్, కేశవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టండి:-ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు, డిసెంబర్ 23:- జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం స్థానిక ఔట్ డోర్ స్టేడియంలోఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో బాగంగా నిర్వహించిన యోగ కార్యక్రమంలో ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.%ఔ వతీఖ%ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈనెల 26వ తారీకు నుండి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు ఈ నెల 22 వ తేది నుండి 24 వ తేది వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా 22 వ తేది టెన్నికాయిట్, ఈరోజు యోగ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. 24 వ తేది 3%ఖ% మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గాను తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ రోజు జరిగిన యోగా కార్యక్రమంలో జాతీయస్థాయిలో పేరుపొందిన యోగా సాధకులు, పిఈటీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. అదే విధంగా విద్యార్థులు యోగా ఆసనాలను ప్రదర్శించి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాలు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయంవంతం చేయాలని ఇంఛార్జి కలెక్టర్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ ఎస్ శ్రీనివాసరావు, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి యోగచార్య అవినాష్ శెట్టియోగా సాధకులు, ఇతరులు పాల్గొన్నారు



# వేంకటేశ్వరాలయంలో మంత్రి పొన్నం పూజలు

సిద్దిపేట,డిసెంబర్24 :
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తనను గెలిపించిన హుస్నాబాద్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేలా తనకు భగవంతుడు ఆశీస్సులు అందించాలని వేడుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# మన్యంలో పెరగిన చలి

## అరకులోయలో మంచు దుప్పటి - జిల్లాల్లో పడిపోయిన ఉష్ణోగ్రతలు

విశాఖపట్టణం,డిసెంబర్23 : విశాఖ మన్యంలో చలి తీవ్రత తగ్గడంలేదు. చలికితోడు మంచు దట్టంగా కమ్ముకుంటున్నది. ఉదయం తొమ్మిదిన్నర గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయల్లో మంచు దట్టంగా అలముకుంది. అలాగే ఏజెన్సీలోని జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పాడేరు, హుకుంపేట ప్రాంతాల్లో వారం రోజులుగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదవుతున్నది. చింతపల్లిలో 7.2డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జనవరి మొదటి వారం వరకు ఏజెన్సీ వ్యాప్తగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవు తాయని అధికారులు తెలిపారు. అరకులోయలో మంచు అందాలు పర్యాటకులను కనువిందు జేస్తున్నాయి. అరకు నుంచి విశాఖపట్నం వెళ్లే దారిలో కొత్తభల్లుగుడ లోయంతా మంచుతో నిండుకొని పాల సముద్రాన్ని తలపిస్తున్నది. సందర్శకులతో మ్యూజియం, పద్మాపురం గార్డెన్, చాపరాయి కిటకిటలాడింది. దీంతో సందర్శకులు మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. మరోవైపు కోనసీమతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో గ్రామాల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణుకుతున్నారు. దీనికితోడు పొగమంచు ఉండడంతో తెల్లవారు జామునే ఇళ్ల నుంచి రావాలంటే సంకోచిస్తున్నారు. పొగమంచుతో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు, రైతు కూలీలు చలిల్లోనే వణుకుతూ పొలంబాట పడుతున్నారు. చలినుంచి విముక్తి పొందేందుకు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఆస్తమా, నిమ్ము, జలుబు, దగ్గు, శ్వాసకోస వ్యాధులతో పాటు జ్వరాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. వారం రోజులుగా పగలు కూడా చలిగాలులు వీస్తున్నాయి. దీంతో చలి తీవ్రతతో గ్రామీణ వాసులు గజగజ వణికిపోతు న్నారు. మంచు సైతం కమ్మేస్తోంది. చలికి భయపడి సాయం త్రం 5 నుంచి ఉదయం 8 గంటల వరకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు వెనుకాడుతున్నారు. గ్రామాల్లో ఉదయం, రాత్రుళ్లు చలిమంటలు కన్పిస్తున్నాయి. పెరిగిన చలితో ఉన్ని దుస్తులు, స్వెటర్ల దుకాణాల వద్ద కొనుగోలు దారులతో రద్దీ కన్పిస్తోంది.

# ఆలయంపై రాజకీయాలు వద్దు: గండ్ర

జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్24
భూపాలపల్లిలో ప్రజల కోసం, లోక కళ్యాణార్థం నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంపై రాజకీయం చేయడం సరికాదు అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెకంటరమణారెడ్డి పేర్కొన్నారు.ఆలయం రాత్రికి రాత్రి నిర్మించింది కాదు. జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య శంకుస్థాపన చేయడం జరిగింది. గుడి నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఆలయం పక్కనే అర్చకులకు, సూపర్‌వైజర్లకు, వంట మనుషులకు, దేవుని సామాగ్రి భద్రపరచడం కోసం, భక్తులు విశ్రాంతి తీసుకోవడం కోసం గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పుడు గుడి పనులను ఆపడం, నోటీసులు ఇవ్వడం రాజకీయ కుట్రలో భాగమే. ప్రజలంతా దీన్ని గమనిస్తున్నారు అని గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

## సంపాదకీయం

# కొత్త వేరియంట్ కలవరం !

శనివారం 23-12-2023

కరోనా ముప్పు తొలగిపోలేదని తాజా ఘటనలతో మరోమారు రుజువు అవుతోంది. కొత్త వైరస్ వణికి స్తోంది. దీంతో మనదేశం కూడా అప్రమత్తం కాక తప్పలేదు. ప్రజలకు మళ్లీ హెచ్చరికలు చేయకా తప్పడంలేదు. కేరళలో ఇప్పటికే వైరస్ తీవ్రత మొదలయ్యింది. తమిళనాడులో కూడా కొన్ని కేసులు వచ్చాయి. హైదరాబాద్ నీలోఫర్‌లో చిన్నారికి, భూపాలపల్లి జిల్లాలో ఓ మహిళకు కరోనా ఉన్నట్లు గుర్తించారు. భారత్‌లో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకూ 24 గంటల వ్యవధిలో కొత్తగా 756 కేసులు బయటపడ్డాయి. తాజా కేసులతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,420కి పెరిగింది. గత ఏడు నెలల్లో కేసుల సంఖ్య ఇంత చేరడం ఇదే తొలిసారి. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడానికి కొత్త వేరియంట్ జేఎన్.1 కారణమని తెలుస్తోంది. ఇక గత 24 గంటల వ్యవధిలో మహమ్మారి కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలో ఇద్దరు కాగా, రాజస్థాన్, కర్ణాటకలో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. దీంతో వైరస్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,332కి ఎగబాకింది. ఇప్పటి వరకూ దేశంలో కరోనా వైరస్ బారిన పడిన వారి సంఖ్య 4.50 కోట్లకు చేరింది. మహమ్మారి నుంచి 4,44,71,212 మంది కోలుకున్నారు. ఇక మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదేవిధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటి వరకూ 220.67 కోట్ల (220,67,79,081) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది. అయితే కొత్త వేరియంట్ ప్రభావం చూపుతున్న క్రమంలో జాగ్రత్తలు అవసరమని హెచ్చరించింది. పండగలతో పాటు, చలి పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని కేంద్రం ఇప్పటికే పలు రాష్ట్రాలను హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా జెఎన్-1 కొత్త వేరియంట్ లక్షణాలున్న వారిని గుర్తించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, జాగ్రత్తలు పాటించడం మళ్లీ అలవాటు చేసుకోవాల్సిన అసవరం పెరిగింది. చలి పెరగడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యనిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా కూడా అనేక రుగ్మతలు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర మార్గదర్శకాల నేపథ్యంలో మళ్లీ ఆంక్షల్లోకి వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆంక్షలు విధించడం మొదలు పెట్టాయి. దీంతో వరుసగా వస్తున్న క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల సందర్భంగా ఒకేచోట వేలమంది గుమి గూడే పరిస్థితి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు సూచిస్తున్నాయి. ఈ మేరకు కేంద్రం కూడా ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఈ క్రమంలో ఇక పండగల వేళ మళ్లీ సందడి లేకుండా పోయే రోజులు వచ్చాయన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది. అయితే మన జాగ్రత్తలో మనం ఉంటూ ముందుకు సాగడం ద్వారా కొత్త వైరస్ వ్యాప్తిని అరికట్టాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిపైనా దీని ప్రభావం పడనుంది. అంతకు ముందే న్యూ ఇయర్ వేడుకలపైనా ప్రభావం చూప నుంది. మొత్తంగా న్యూ ఇయర్ వేడుకల నిర్వహణలో పలు జాగ్రత్తలు పాటించాలి. అయ్యప్ప భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. రెండేళ్లక్రిం కూడా ఇలాంటి పరిస్థితే వచ్చింది. దీంతో క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలపై తీవ్ర ప్రభావం పడింది. ఆంక్షలే విధిస్తే..కరోనా మళ్లీ విజృంభిస్తే ఇది ఓ రకంగా చిన్న వ్యాపారులకు తీరని దెబ్బ కాగలదు. ఇప్పటికే కరోనా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశించింది. మరోవైపు కోవిడ్ మార్గదర్శకాలను ఎప్పటి కప్పుడు పాటించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్ర మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించడం తో వైరస్ వ్యాప్తిని గుర్తించి ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. కొత్త వేరియంట్ విజృంభిస్తున్ననం దున ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా హెచ్చరిం చాయి. పండుగలకు పెద్ద ఎత్తున జనం గ్రామాలకు వెళ్లే అవకాశం ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని ఆదేశించింది. గ్రామాలకు వెళ్లేవారు జగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పరోక్షంగా చెప్పింది. ఈ క్రమంలో ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆర్టీపిఎస్ పరీక్షలకు రంగం సిద్దం చేసాయి. ఆస్పత్రులను వైద్య సేవలకు అనుగుణంగా సిద్ధం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలు కోవిడ్ నిబంధనల మేరకు చర్యలకు ఉపక్రమించాయి. అయితే కొత్తగా వ్యాప్తి చెందుతున్న జెఎన్-1 డేంజర్ కాదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. కానీ కేసుల సంఖ్యలో రోజురోజుకూ మార్పులు వస్తున్నాయి. క్రమంగా కేసుల సంఖ్య పెరుగుతోంది. అయినా మనం భయపడాల్సిన అవసరం లేదని కూడా అంటున్నారు. ఇకపోతే దేశంలో ఇప్పటికే 90 శాతానికిపైగా రెండు వ్యాక్సిన్ డోసులు తీసుకున్నారు. అందులో దాదాపు 90 శాతం మంది కొవిడ్ బారిన పడ్డారు. తద్వారా వారిలోని సహజ రోగనిరోధక శక్తి పెరిగింది. ఇలా మనదేశంలో హైబ్రిడ్ ఇమ్యూనిటీ ఉన్నందున కొత్త వేరియంట్లు పెద్దగా ప్రభావం చూపడం లేదని పేర్కొంటున్నారు. అయినా అప్రమత్తంగా ఉండడం మంచిదని సూచిస్తున్నారు. ఇకపోతే మొత్తంగా ఇప్పుడు తాజా పరిస్థితులను చూస్తుంటే ముప్పు కళ్లముందే కనిపిస్తోంది. విందులు.. వినోదాలు..ఆటపాటల్లో జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. మొత్తంగా కొవిడ్ భయం మరోసారి వచ్చేస్తోంది. దేశప్రజలకు కొవిడ్ పట్ల జాగ్రత్తలు అవసరమేనని సూచించిన వెంటనే వైద్య,ఆరోగ్యశాఖ ప్రత్యేక నిబంధనలు జారీ చేసింది. ప్రతి చోటా మాస్కులు తప్పనిసరిగా వాడటం ఉత్తమమని సూచిస్తున్నారు.

--------------------

## ఎన్నికల వేళ.. ఏపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీగా

# ఠాగూర్ నియామకం

ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ డిసెంబర్ 23: దేశంలో సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి/మార్చి నాటికి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ ఎన్నికలను ఎదుర్కొనడానికి అన్ని పార్టీలు సమాయాత్తమౌతోన్నాయి. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ నాయకత్వాన్ని వహిస్తోన్న ఇండియా కూటమి.. ఇప్పటి నుంచి కసరత్తు మొదలు పెట్టాయి.

ఇటీవలే ముగిసిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మిజోరం మినహాయిస్తే- మూడు చోట్ల బీజేపీ, ఒక దాంట్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించిన విషయం తెలిసిందే. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడానికి ఎన్నికల మేనిఫెస్టో కీలకంగా మారిందనేది బహిరంగ రహస్య%శీ.

%ఇదే దూకుడును అటు లోక్‌సభ, ఇటు ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నట్టు కనిపిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. సంస్థాగతంగా ప్రక్షాళణకు పూనుకుంది. దీని కోసం భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ స్థాయిలో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులకు కొత్త బాధ్యతలను అప్పగించింది. ప్రియాంక గాంధీ వాద్రాకు ఇదివరకు ఉన్న ఉత్తరప్రదేశ్ ఇన్‌ఛార్జీ బాధ్యతల నుంచి తప్పించింది. ఏపీ సహా పలు రాష్ట్రాలకు ఇన్‌ఛార్జీలను అపాయింట్ చేసింది. ముకుల్ వాస్నిక్- గుజరాత్, జితేంద్రసింగ్- అస్సాం, మధ్యప్రదేశ్ (అదనపు ఇన్‌ఛార్జ్) బాధ్యతలను అప్పగించింది.

రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా- కర్ణాటక, దీపక్ బబారియా- ఢిల్లీ, హర్యానా (అదనపు ఇన్‌ఛార్జ్), సచిన్ పైలెట్- ఛత్తీస్‌గఢ్, అవినాష్ పాండే- ఉత్తరప్రదేశ్, జీఏ మిర్- జార?ండ్, పశ్చిమ బెంగాల్ (అదనపు ఇన్‌ఛార్జ్), దీపా దాస్‌మున్షీ- కేరళ, లక్షద్వీప్, తెలంగాణ (అదనపు ఇన్‌ఛార్జ్), జైరామ్ రమేష్- కమ్యూనికేషన్స్, కేసీ వేణుగోపాల్- ఆర్గనైజేషన్ నియమించింది.

వివిధ రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ కొత్త ఇన్‌ఛార్జీలు అపాయింట్ అయ్యారు. రమేష్ చెన్నితల- మహారాష్ట్ర, మోహన్ ప్రకాష్- బిహార్, డాక్టర్ చెల్లకుమార్- మేఘాలయా, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, డాక్టర్ అజొయ్ కుమార్- ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి (అదనపు ఇన్‌ఛార్జ్)గా నియమితులయ్యారు.

భరత్‌సింహ్ సోలంకి- జమ్మూ కాశ్మీర్, రాజీవ్ శుక్లా- హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్, దేవేందర్ యాదవ్- పంజాబ్ బాధ్యతలను అప్పగించింది ఏఐసీసీ. మొన్నటివరకు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీగా వ్యవహరించిన మాణిక్ రావ్ థాకరేను అదే స్థానంలో కొనసాగిస్తూనే గోవా, దామన్, డయ్యు, దాద్రానగర్ హవేలీ బాధ్యతలను కేటాయించింది. దీపా దాస్‌మున్షీ తెలంగాణకు అదనపు ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తారు.

కీలకమైన ఏపీ ఇన్‌ఛార్జీ బాధ్యతలను మాణిక్కం ఠాగూర్ చేతిలో పెట్టింది. గతంలో ఆయన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీగా వ్యవహరించిన విషయం తెలిసిందే. త్వరలోనే ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు. ఏపీతో పాటు అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీగా పని చేస్తారాయన. గిరీష్ చోడంకర్‌కు త్రిపుర, సిక్కిం, మణిపూర్, నాగాలాండ్ బాధ్యతలను అప్పగించింది.



# జిల్లా పారిశ్రామిక ప్రగతికి మైలురాయి. సెంచరీ పరిశ్రమ- సీఎం జగన్

ఆంధ్ర ప్రగతి కడప జిల్లా డిసెంబర్ 23: శనివారం సీఎం జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి కడప చేరుకున్నారు. అక్కడి నుంచి గోపవరం చేరుకుని సెంచరీ ప్లై పరిశ్రమలోని ఎండీఎఫ్, హెచ్‌పీఎల్ ప్లాంట్లను ప్రారంభించారు. ఆ తర్వాత కడప రిమ్స్ వద్ద డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించారు. దీంతో పాటు డాక్టర్ వైఎస్సార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌ను ప్రారంభించిన అనంతరం అదే రిమ్స్ ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ క్యాన్సర్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించారు. అనంతరం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభిస్తారు. అలాగే, వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఫ్లడ్‌లైట్లను ప్రారంభించారు. ఆ తర్వాత ఆధునీకరించిన కలెక్టరేట్ భవనాన్ని, నవీకరించిన అంబేద్కర్ సర్కిల్, వై.జంక్షన్, కోటిరెడ్డి సర్కిల్, సెవెన్ రోడ్స్ సర్కిల్ ప్రారంభించారు. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన అనంతరం ఇడుపులపాయకు బయలుదేరారు. వైఎస్సార్ ఎస్టేట్‌లోని గెస్ట్‌హౌస్‌లో రాత్రికి బసచేస్తారు.

బద్వేలు నియోజకవర్గంలో ఏర్పాటైన సెంచరీ పరిశ్రమ.. జిల్లా పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి అని సీఎం జగన్ అభివర్ణించారు. శనివారం ఉదయం గోపవరం మండల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్క్ లో నూతనంగా నిర్మించిన %వీ/రా% సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఉత్పత్తి యూనిట్ ను సీఎం జగన్ ప్రారంభించి,శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం లాంజ్ రూమ్ లో సీఎం సెంచరీ ప్లై కంపెనీకి సంబంధించిన వీడియోను తిలకించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో.. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా,ఎంపీ అవినాష్ రెడ్డి,బద్వేలు ఎమ్మెల్యే డా. దాసరి సుధ, అడా చైర్మన్ గురుమోహన్,ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ విజయ ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ డిసి గోవింద రెడ్డి,సెంచూరీ ప్లై వుడ్ ఛైర్మెన్ సజ్జన్ బజంకా,మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్,ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కేశన్ బజంకా,ప్రెసిడెంట్ హిమన్షు,వైస్ ప్రెసిడెంట్ తుషార్ పట్నాయక్,ఎక్జిక్యూటివ్ అసిస్టెంట్ అంకిత్ బంటియా అధికారులు...జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు,జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ లు పాల్గొన్నారు.

బద్వేలు నియోజకవర్గ కేంద్రానికి సమీపంలో గోపవరం మండల పరిధిలో ఏర్పాటైన ఇండస్ట్రియల్ పార్కులో.. అన్ని మౌలిక సదుపాయాలతో సహా ఎకరా రూ.15 లక్షల రాయితీ ధరతో ఏపీఐఐసి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 100 ఎకరాల విస్తీర్ణంలో %వీ/రా% సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఏర్పాటయింది. రూ.956.00 కోట్ల మేర పెట్టుబడితో రూపుదిద్దుకున్న ఈ సీపీఎల్ పరిశ్రమలో.. మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డ్ , హై ప్రెజర్ లామినేట్స్ ఉత్పత్తిని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. కాగా చెక్క పలకలు, అలంకరణ సంబంధ వుడ్ షీట్స్ తయారీలో దేశంలోనే ప్రసిద్ధిగాంచిన సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ సంస్థ.. 2266 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా.. ఈ ప్రాంతంలో ఏర్పాటయింది. అంతేకాకుండా స్వలాభం కోసమే కాకుండా బద్వేలు నియోజకవర్గ పరిసర ప్రాంత రైతులకు లబ్ది చేకూర్చేలా కంపెనీ ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకును.. రైతుల నుండే నేరుగా కొనుగోలు చేస్తోంది.

భవిష్య అవసరాల కొరతను తీర్చేందుకు గాను.. ఈ కంపెనీ ద్వారా రానున్న 8 ఏళ్లలో 80,000 ఎకరాల భూమిలో చెట్లను పెంచేందుకు స్థానిక రైతులను ప్రోత్సహిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే.. 1000 మంది రైతులకు సబంధించి 5000 ఎకరాల్లో రాయితీ ధరతో చెట్లను నాటడానికి అవకాశం కల్పించారు.

సీపీఎల్ పరిశ్రమకు నీటి అవసరాలకు గాను.. ప్రభుత్వం బ్రహ్మం



సాగర్ రిజర్వాయర్ నుండి 0.07 టీఎంసీల నీటిని కూడా కేటాయించారు. అందుకోసం.. రిజర్వాయర్ నుండి ప్లాంట్ సైట్ వరకు రూ.45 కోట్లతో వాటర్ పైప్ లైన్ కూడా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా నిరంతారాయ విద్యుత్ సరఫరా కోసం ఏపీ ఐఐసి ద్వారా రూ.19.11 కోట్లు వెచ్చించి 132 కెవి విద్యుత్ లైన్ ను ఏర్పాటు చేసింది.ఈ కార్యక్రమంలో అగ్రోస్ డిస్టిక్ మేనేజర్ విజయకుమార్,ఎస్సి కార్పొరేషన్ ఈడి డా.హెచ్. వెంకట సుబ్బయ్య,ఏపీ ఐఐసి ఈ.ఈ శ్రీనివాస మూర్తి , ఆర్డీవో వెంకట రమణ పాల్గొన్నారు.

కడప రిమ్స్ ప్రాంగణంలో రూ.125 కోట్లతో 452 పడకల వైయస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ని సీఎం జగన్ ప్రారంభించారు. రూ.40.81 కోట్లతో 100 పడకల వైయస్సార్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ వైద్యశాలనికూడా సీఎం ప్రారంభోత్సవం చేశారు. అంతేకాకుండా రూ.107 కోట్లతో 100 పడకల కేన్సర్ బ్లాక్ ని ప్రారంభించారు.

సీఎం జగన్ దివ్యాంగులకు 50 స్కూటర్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా సీఎం జగన్ వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ప్రారంభించారు

# ప్రేమతత్వమే ఏసు మార్గం

## క్రీస్తు జన్మించిన రోజునే క్రిస్మస్

విజయవాడ,డిసెంబర్23 ):

ఏసు క్రీస్తు పుట్టిన రోజును క్రిస్మస్‌గా జరుపుకుంటారు. ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా క్రైస్తవులు జరుపుకునే పండుగ క్రిస్మస్. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు దీన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. జీసస్ జన్మించి నేటికి రెండు వేల ఏళ్లు దాటినా కరుణామయుడుగా, దయామయుడుగా ఆయన క్రైస్తవుల ఆరాధనలను అందుకుంటున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైవస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ క్రిస్మస్. క్రీస్తు జన్మించిన రోజు కావడం వల్లే క్రిస్మస్ జరుపుకుంటున్నారు. ఏసు అంటే రక్షకుడు అని అర్థం. క్రిస్‌మస్ క్రైస్తవులకు ముఖ్యమైన పండగ. దేవుడు కొలువుదీరేది ఆత్మలో అయితే... దానికి మార్గం- క్రీస్తు బోధించిన ప్రేమతత్వం, కరుణ, క్షమ. 'సంపూర్ణ మానవత్వమే మనిషిని మహాపురుషుడిగా, దైవస్వరూపుడిగా మారుస్తుంది'- ఇదే క్రిస్మస్ పర్వదినం ద్వారా సమస్త మానవాళికి అందే శుభసందేశం. కొంతమంది క్రైస్తవులు డిసెంబర్ 25న, మరికొంత మంది ఆర్థడాక్స్ చర్చిలకు చెందిన క్రైస్తవులు జనవరి 7న క్రిస్టమస్‌ను జరుపుకుంటారు. రెండు వేల ఏళ్ల కిందట రోమ్ సామ్రాజ్యాన్ని పాలించే ఆగస్టస్ సీజర్ తన రాజ్యంలో ఎంత మంది జనాభా ఉన్నారో లెక్కించాడు. సులభంగా ఈ లెక్కలు సేకరించడానికి వీలుగా ప్రజలందరూ ఎవరి స్వగ్రామాలకు వాళ్లు డిసెంబరు 25 తేదీలోగా చేరుకోవాలని ఆజ్ఞాపించాడు. అదే సమయంలో రోమన్ సామ్రాజ్యంలోని నజరేతు పట్టణంలో ఉండే మేరీతో జోసెఫ్‌కు పెళ్లి కుదిరింది. ఒక రోజున మేరీకి గాబ్రియేల్ అనే దేవదూత కలలో కనబడి 'ఓ మేరీ! నీవు దైవానుగ్రహం పొందావు. కన్యగానే గర్భం దాల్చి ఓ కుమారునికి జన్మనిస్తావు. నీకు పుట్టే బిడ్డకు ఏసు అని పేరు పెట్టాలి. అతడు దేవుని కుమారుడు' అని చెప్పాడు. నజరేయుడైన యేసుగా కూడా పిలవబడే ఈయన క్రైస్త్రవ మత మూల పురుషుడు. ఇందులో క్రీస్తు అన్న పదము గ్రీకు భాషలో క్రీస్తోస్ ('అభిషిక్తుడు') అనే అర్థం వచ్చే పదం నుండి పుట్టిన ముకుటం. ఇది హీబ్రూలో 'మెసయ్యా'కు సమానార్థము కలపదము. రెండువేల సంవత్సరాల క్రితం సంగతి. ఒక అభాగ్యురాలు, సమాజ నిరాపేక్షకు గురైన ఒక స్త్రీ ఆ జనం ఎదుట దోషిగా నిలబడింది. ఆమె చుట్టూ ఉన్నవారి చేతుల్లో రాళ్ళు. పాపం చేసినవారిని రాళ్ళతో కొట్టి చంపడం ఆ దేశంలో ఉన్న దారుణమైన ఆచారం. ఇంతలో వారి మధ్యలోకి ఒక ఆజానుబాహువు వచ్చాడు. అంతా ఒక్కసారి వెనుతిరిగారు. వారి చేతుల్లోని రాళ్ళు కింద పడ్డాయి. ఆమె చేతులు జోడించి ఆయన ముందు మోకరిల్లింది. ఆయనే ప్రభువైన యేసుక్రీస్తు. పాపం చేసినవారికి శిక్ష విధించడం కాదు. పాపమే మరణించాలి. అలా జరిగితే పాపంలేని మనిషి పాపరహితుడై యేసుక్రీస్తులా మారతాడని దేవుని నమ్మకం. అందుకే నశించిన దాన్ని వెదికి రక్షించే నిమిత్తం ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసు క్రీస్తును ఈలోకానికి పంపాడని విశ్వసిస్తారు. అలా సమస్త మానవాళి పాపపరిహారార్థం దేవుడు నరుడిగా జన్మించిన పవిత్రమైన రోజే క్రిస్మస్. యేసుక్రీస్తు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలసింది. ఆ నక్షత్రాన్ని అనుసరించి వెళ్ళి బాలయేసును దర్శించిన ముగ్గురు జ్ఞానులు పరమానంద భరితులయ్యారు. ఆ సంతోషానికి గుర్తుగా వారు బాలయేసుకు మూడు కానుకలను సమర్పించారు. అవి బంగారము, బోళం, పరిమళ సాంబ్రాణి. వారు సమర్పించిన బంగారం క్రీస్తు ప్రభువు పరిశుద్ధతకు, పవిత్రతకు చిహ్నంగా కనబడుతుంది. బోళం సమర్పణకు సూచన. తండ్రి అయిన దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును ప్రేమతో సమర్పించిన రీతిలో అందరూ ఒకరిపట్ల మరొకరు ప్రేమానురాగాలు కలిగి ఉండటం, ద్వేషాన్ని విడనాడటం క్రిస్మస్ పర్వదినం ప్రాముఖ్యం. ఇక ఆనాడు జ్ఞానులు కానుకగా సమర్పించిన పరిమళ సాంబ్రాణిని ఆరాధనకు సూచనగా లేఖనాలు పేర్కొంటాయి. అహంకారంతో అవమానం, వినయ విధేయతలతో జ్ఞానం కలుగు తాయి. నీ కన్నతండ్రి హితోపదేశం విను, నీ తల్లి వృద్ధాప్యంలో ఉంటే ఆమెను నిర్లక్ష్యం చేయకు- ఇవి క్రీస్తు పలికిన అమృత వాక్కులు. తప్పిపోయిన గొర్రె వంటి అమాయక ప్రజలను వెదికి రక్షించేందుకు ఈ లోకంలోకి వచ్చిన ప్రభువుగా ఆయనను కీర్తిస్తారు. ఇందుకు సాదృశ్యంగా ఆయన జన్మించినప్పుడు ఆ శుభవర్తమానం అమాయకులైన గొర్రెల కాపరులకే ముందుగా తెలియడం ఆశ్చర్యానుభూతి కలిగించే విషయం.

# టైగర్ బ్యూటీ అందాల స్టైల్




హిందీ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి తెలుగు లో రన్ రాజా రన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్ హిందీ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టి తెలుగు లో రన్ రాజా రన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్. ఈ అమ్మడు అందాల ఆరబోత విషయంలో ఎప్పుడు కూడా తగ్గలేదు. కానీ ఈ అమ్మడికి అదృష్టం కలిసి రాకపోవడంతో ఎక్కువ ఆఫర్లు ఈ అమ్మడి తలుపు తట్టలేదు. వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్ ను కూడా సద్వినియోగం చేసుకుంటూ కెరీర్ లో ముందుకు సాగిన ఈ అమ్మడు ఇప్పుడు హిందీలో నటించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తెలుగు లో సందీప్ కిషన్ తో కలిసి నటించిన టైగర్ సినిమా లో అందంతో పాటు నటన విషయంలో కూడా విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు అందాల ఆరబోత కంటిన్యూ అవుతూనే ఉంది. తాజాగా ఈ టైగర్ బ్యూటీ కొత్త ఫోటోలను షేర్ చేసింది. ఎప్పటిలాగే ఈమె అందానికి అంతా ఫిదా అవ్వాల్సిందే అన్నట్లుగా అందంగా కనిపిస్తోంది. అందాల ప్రదర్శన విషయంలో బాలీవుడ్ ముద్దుగుమ్మలకు ఈమె పోటీ అన్నట్లుగా ఈ ఫోటోలు ఉన్నాయి. ఇంత అందంగా ఉన్న సీరత్ కపూర్ ఇప్పుడు కాకున్నా ముందు ముందు అయినా మరిన్ని సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుని హిట్ ను సొంతం చేసుకుని మంచి పేరును దక్కించుకోవాలని నెటిజన్స్ ముఖ్యంగా ఈమె ఫాలోవర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు



# ఖిలాడి బ్యూటీకి గుంటూరు కారం ఐటెం..!

ఇక గుంటూరు కారం సినిమాలో ఒక మాస్ ఐటెం సాంగ్ ఉంటుందని మొదటి నుంచి కూడా ప్రచారం జరుగుతోంది సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబోలో రూపొందుతున్న గుంటూరు కారం సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమా లో హీరోయిన్ గా శ్రీలీల నటిస్తుండా, రెండో హీరోయిన్ గా మీనాక్షి చౌదరి నటిస్తున్నట్లు ఇప్పటికే అధికారికంగా క్లారిటీ ఇవ్వడం జరిగింది. ఇక గుంటూరు కారం సినిమాలో ఒక మాస్ ఐటెం సాంగ్ ఉంటుందని మొదటి నుంచి కూడా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించాల్సిన పూజా హెగ్డే ఛాన్స్ మిస్ చేసుకున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా ఛాన్స్ మిస్ చేసుకున్న పూజా హెగ్డే కి ఐటం సాంగ్ ని చేసే ఛాన్స్ ఇస్తారనే వార్తలు వచ్చాయి. గుంటూరు కారం లో పూజా హెగ్డే ఐటెం సాంగ్ చేయడం లేదని.. ఆ పాటలో ఖిలాడి బ్యూటీ డింపుల్ హయతి కనిపించబోతుందని యూనిట్ సభ్యుల ద్వారా విశ్వసనీయ సమాచారం అందుతోంది. ఐటం సాంగ్స్ కి డింపుల్ పెట్టింది పేరు అన్నట్లుగా ఈ మధ్య కాలంలో మారింది. అందుకే త్రివిక్రమ్ ఆమెను ఎంపిక చేశారనే వార్తలు వస్తున్నాయి. థమన్ స్వరపర్చిన మాస్ ఐటం సాంగ్ లో మహేష్ బాబు మరియు డింపుల్ హయతి ల డాన్స్ సినిమాలో ప్రధాన ఆకర్షణగా ఉంటుందని యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. సంక్రాంతికి రాబోతున్న అన్ని సినిమాల్లోకి గుంటూరు కారం సినిమాకు ఎక్కువ హైప్ క్రియేట్ అయ్యింది. అందుకే ఏ విషయంలో కూడా ఛాన్స్ తీసుకోకుండా త్రివిక్రమ్ ప్లాన్ చేస్తున్నాడు. మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబోలో గతంలో వచ్చిన అతడు మరియు ఖలేజా సినిమాల ఫలితాలు నిరాశ పరిచిన కూడా.. ఇన్నాళ్ల తర్వాత వీరి కాంబోలో రాబోతున్న సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అలాంటి క్రేజీ సినిమాలో డింపుల్ హయతి ఐటం సాంగ్ చేయబోతున్న నేపథ్యంలో ఆమె కెరీర్ కచ్చితంగా యూటర్న్ తీసుకునే అవకాశాలు ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది



# ఉల్లిపొర బులుగులో జివ్వుమనిపించిన జాకీ!

తాజాగా జాకీ నుంచి మరో హాట్ ఫోటో నెట్టింట వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా బులుగు ఉల్లి పొరలాంటి డిజైన్ లో అమ్మడు స్కిన్ షో చేసిన వైనం యువతని ఆకర్షిస్తుంది. కొన్నాళ్ల పాటు సైలెంట్ గా ఉన్న జాక్వెలిన్ పెర్నాండేజ్ మళ్లీ గ్లామర్ వరల్డ్ రేస్ లోకి వచ్చేసిన సంగతి తెలిసిందే. కాన్ మాన్ సుకేష్ చంద్రశేఖర్ తో రిలేషన్ షిప్..200 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు మొదలైన తర్వాత అమ్మడు ఇన్ స్టాలో యాక్టివిటీ తగ్గించింది. ఈడీ విచారణలు..సుకేష్ ప్రేమలేఖల వ్యవహారంతో అమ్మడు ఉక్కిరి బిక్కిరైంది ఇంతకాలం. దేశం దాటకుండా లుకౌట్ నోటీసులు అందుకో వడం...ఆతర్వాత వాటిని ఉపసంహరించుకునేలా చర్యలతో ఏడాది పాటు చాలా ఇబ్బంది పడింది. చివరికి సుకేష్ తో ఎలాంటి సంబంధం లేదని తెగేసి చెప్పడంతో సీన్ మొత్తం రివర్స్ అయింది. ఇప్పుడ తని నుంచి బెదిరింపులొస్తున్నాయని కొత్త పల్లవి అందుకోవడంతో అమ్మడు పూర్తిగా ఫ్రీ అయినట్లు కనిపిస్తుంది. దీంతో మళ్లీ యధావిధిగా ఇన్ స్టాలో యాక్టివిటీ కూడా కొద్ది రోజుల క్రితమే ప్రారంభించింది. రీసెంట్ గా దుబాయ్ లో జరిగిన వేడుకలకు సైతం హాజరై తానెంతో సంతోషంగా ఉందో చెప్పకనే చెప్పింది ఈ నేపథ్యంలో తాజాగా జాకీ నుంచి మరో హాట్ ఫోటో నెట్టింట వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా బులుగు ఉల్లి పొరలాంటి డిజైన్ లో అమ్మడు స్కిన్ షో చేసిన వైనం యువతని ఆకర్షిస్తుంది. పాలనురుగుల లాంటి జాకీ సౌందర్యంపై ఆ డిజైన్ మరింత అందంగా కనిపిస్తుంది. దుబాయ్ లో జరిగిన మూన్ లైట్ మ్యూజికల్ పెస్టివల్ వేడుకలో భాగంగా ఇలా ముస్తాబై ర్యాంప్ పై హొయలు పోయింది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. దీంతో అభిమానుల కామెంట్లకు హద్దు లేదు. జాకీ బ్యూటీని ఆకాశానికి ఎత్తేస్తూ అవదులు లేని కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. జాకీపై మునుపెన్నడు చూపించనంత ఘాడమైన ప్రేమను కామెంట్లు రూపంలో అభిమానులంతా కురిపిస్తున్నారు సుమీ. ఇక శ్రీలంక బ్యూటీ కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ తో పాటు ఇతర భాషల్లోనూ బాగానే అవకాశాలు అందిపుచ్చుకుంటుంది.

# కంగ్రాట్స్.. దేవా ప్రభాస్

## - చిరంజీవి





యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' మూవీ ఘన విజయం సాధించింది. దేశ వ్యాప్తంగా ఈ సినిమా సూపర్ హిట్ టాక్ ను సొంతం చేసుకుంది. ఉత్కంఠభరితమైన సన్నివేశాలు, హై టెక్నికల్ వాల్యూస్, అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ కు సినీ అభిమానులు ఫిదా అవుతున్నారు. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు. ఎక్స్ వేదికగా చిరంజీవి స్పందిస్తూ... 'మైడియర్ దేవా ప్రభాస్ కు హార్థిక అభినందనలు. 'సలార్' బాక్సాఫీస్ వద్ద సెగలు రేపింది. అద్భుతమైన విజయం సాధించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ కు అభినందనలు. ప్రపంచ నిర్మాణంలో మీరు రాణిస్తారు. పృథ్వీ, శ్రుతిహాసన్, జగపతిబాబు, చిత్ర యూనిట్ భువన్ గౌడ్, రవి బస్రూర్, వీసీ చలపతి, నిర్మాత కిరగందూర్ లకు అభినందనలు' అని ట్వీట్ చేశారు.



# నెం.4 గా మిల్కీ బ్యూటీ

NBK109 సినిమాలో ముగ్గురు ముద్దుగుమ్మలు హీరోయిన్స్ గా కనిపించబోతున్నారు అనే ప్రచారం మొదటి నుంచే జరుగుతోంది. నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో తన 109వ సినిమా ను చేస్తున్న విషయం తెల్సిందే. అఖండ, వీర సింహా రెడ్డి, భగవంత్ కేసరి సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకున్న బాలయ్య ప్రస్తుతం బాబీ తో కలిసి చేస్తున్న NBK109 సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. వాల్తేరు వీరయ్య సినిమా తో చిరంజీవి కి మాస్ విజయాన్ని అందించిన దర్శకుడు బాబీ ఇప్పుడు బాలయ్యకు అంతకు మించి అన్నట్లుగా ఒక కమర్షియల్ బ్లాక్ బస్టర్ ఇవ్వడం కోసం రెడీ అవుతున్నాడు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం అయిన ఈ సినిమా ను 2024 సమ్మర్ లో విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారు. సినిమాలో ముగ్గురు ముద్దుగుమ్మలు హీరోయిన్స్ గా కనిపించబోతున్నారు అనే ప్రచారం మొదటి నుంచే జరుగుతోంది. ఇప్పటికే బాలీవుడ్ బ్యూటీ ఊర్వశీ రౌతేలా ఈ సినిమా షూట్ లో పాల్గొంది. గుంటూరు కారం సినిమాలో నటిస్తున్న మీనాక్షి చౌదరి కూడా బాలయ్య కు జోడీగా ఈ సినిమాలో నటిస్తుందనే వార్తలు వస్తున్నాయి. మూడో హీరోయిన్ విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ సమయంలోనే సినిమాలో నాల్గవ హీరోయిన్ గా మిల్కీ బ్యూటీ కనిపించబోతుంది అనే వార్తలు వస్తున్నాయి. అయితే మిల్కీ బ్యూటీ కేవలం ఐటెం సాంగ్ లో మాత్రమే కనిపించే అవకాశాలు ఉన్నాయట. ఈ మధ్య కాలంలో తమన్నా ఐటెం సాంగ్స్ కి మంచి స్పందన దక్కిన విషయం తెల్సిందే. బాబీ గతంలో జై లవకుశ సినిమాలో తమన్నా తో స్వింగ్ జర అనే ఐటం సాంగ్ చేయించాడు. స్వింగ్ జర ఐటం సాంగ్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అంతే కాకుండా సినిమాకు సంబంధించిన విజయం లో మిల్కీ బ్యూటీ పాత్ర ఉందనే టాక్ కూడా దక్కింది. అందుకే మరోసారి ఆ సెంటిమెంట్ ని రిపీట్ చేసే ఉద్దేశ్యంతో దర్శకుడు బాబీ తన తాజా బాలయ్య సినిమాలో తమన్నా తో ఐటం సాంగ్ చేయించాలని నిర్ణయించుకున్నాడని తెలుస్తోం

# చూపు తిప్పుకోనివ్వని అందాల మృణాల్

హిందీ ప్రేక్షకులకు బుల్లితెర మరియు వెండి తెర ద్వారా సుదీర్ఘ కాలంగా సుపరిచితురాలు అయిన మృణాల్ ఠాకూర్ సీతారామం సినిమా తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. హిందీ ప్రేక్షకులకు బుల్లితెర మరియు వెండి తెర ద్వారా సుదీర్ఘ కాలంగా సుపరిచితురాలు అయిన మృణాల్ ఠాకూర్ సీతారామం సినిమా తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. నార్త్ లో ఎప్పటి నుంచో చేస్తున్నా కూడా దక్కని గుర్తింపు మరియు గౌరవం కేవలం సీతారామం సినిమాతో మృణాల్ దక్కించుకుంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ ఇమేజ్ ను దక్కించుకుంది. తాజాగా హాయ్ నాన్న సినిమా తో వచ్చి మరో విజయాన్ని మృణాల్ తన ఖాతాలో వేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అవ్వడంతో చీర కట్టులో అయినా మోడ్రన్ డ్రెస్ లో అయినా మృణాల్ చూపు తిప్పుకోలేనంత అందంగా కనిపిస్తుంది. తాజాగా మరోసారి ఒక ట్రావెల్ సంస్థకి ప్రమోషన్ కోసం ఫోటో షూట్ లో మృణాల్ మెరిసింది. తాజా ఫోటో షూట్ లో మరింత అందంగా ఆకర్షణీయంగా ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ కనిపిస్తోందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న మృణాల్ ఠాకూర్ సినిమాల్లో ఆ స్థాయి అందాల ప్రదర్శన కు ఛాన్స్ రాలేదు అన్నట్లుగా కామెంట్స్ వినిపిస్తున్నాయి. బ్యాక్ టు బ్యాక్ టాలీవుడ్ లో విజయాలను సొంతం చేసుకున్న మృణాల్ హ్యాట్రిక్ కోసం విజయ్ దేవరకొండతో కలిసి ఫ్యామిలీ స్టార్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. అన్ని వర్గాల వారిని మెప్పిస్తూ టాలీవుడ్ లో బలమైన ముద్ర వేస్తున్న మృణాల్ ఠాకూర్ ముందు ముందు మరిన్ని పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి

